# మౌనవేదన!

శ్రీ జె. రాఘవేంద్రరావు

"టెలిగ్రాం, సార్"

తలవంచుకొని, పరధ్యానంగా ఉన్న శేఖరం, అదిరిపడిలేచి నిలబడ్డాడు. ఏదో అశుభసూచన అతని హృదయంలో, బాకులా దూసుకుపోయింది. టెలిగ్రాం కవరు తీసుకుంటూండగా, చెయ్యి గజగజా వణికింది. కళ్లు బైర్లు కమ్మాయి. తోడిగుమాస్తాలు, చుట్టూచేరి, ఆతురతగా చూస్తున్నారు. శేఖరం, కవరు విప్పిచూడటానికి భయపడుతున్నాడు. రామారావు, అది తీసుకొని "పార్వతి జబ్బుగావుంది. వెంటనే బయలుదేరు." అని చదివాడు. శేఖరం ఒక నిట్టూర్పు విడిచాడు. పార్వతి యింకా జీవించే వుందన్నమాట-వెంటనే అక్కడ, రెక్కలు కట్టుకొని వాలి ఆమెను రక్షించుకోవాలి. గబగబా శెలవు చీటీ రాసి యజమాని గదిలోకి వెళ్ళాడు.

ఆయన 'ఏం. వచ్చావ్?" అన్నట్లు కళ్ళజోడు లోనుండి తీక్ష్ణంగా చూశాడు. శేఖరం, శెలవు కాగితం బల్లమీద పెట్టాడు. ఆయన అది చదివి,

"నీ వయస్సెంత?" అన్నాడు.

"ఇరవై రెండండి."

"ఇప్పుడే నీకు పెళ్ళి - పెళ్లాం కాపరానికి రావడం, ఆమె ప్రసవానికి వెళ్ళడమూనా? ఇదే పాశ్చాత్య దేశాల్లో అయితే, మగవాళ్ళు నలభై ఏళ్లు వచ్చేదాకానూ, ఆడవాళ్లు ముప్పై ఏళ్ళ వరకూనూ, పెళ్ళిళ్లు చేసుకోరు. అందుచేతే, ఆ దేశాల్లో శిశుమరణాలూ, మాతృగండాలూ, చాలా తక్కువ—"

శేఖరానికి తొందరగా పోవాలని వుంది. కాని ఏమీ అనలేక యిటూ అటూ కదిలాడు.

"సరే - శెలవు రెండురోజులిస్తాను. వెంటనే, బయలుదేరిరా-నీపని, అసలే బకాయిలో వుంది. తాళం చెవులు రామారావు కప్పగించు."

శేఖరం తనపని బకాయిలో లేదని చెపుదామనుకున్నాడు కాని, మళ్ళీ ఆలస్యమవుతుందని భయపడి, నమస్కారం చేసి బయటకి వచ్చాడు. తోడిగుమాస్తాలింకా, శేఖరం బల్లదగ్గరే నిలబడ, మెల్లగా మాట్లాడుకుంటున్నారు. శేఖరం, గబగబా కాగితాలు సర్దుకొని బీరువా తాళంవేసి, తాళంచెవులు రామారావుకిచ్చి "నేను వెడుతున్నాను" అన్నాడు, గద్గదకస్వరంతో.

"ఏం పర్వాలేదు. ధైర్యంగా వెళ్లిరా" అన్నాడు హెడ్‌గుమాస్తా. శేఖరం బయటికి నడిచాడు. వెనక, రామారావు కూడావచ్చి "శేఖరుగా! ఈ పాతికా దగ్గరుంచుకో! అవసరానికి ఉపయోగపడతాయి. కంట్రాక్టరు నాయుడుదగ్గర లాగనులే!" అంటూ, శేఖరం చేతిలో పెట్టాడు. శేఖరానికి, కృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియక రామారావు రెండు చేతులూ పట్టుకున్నాడు. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"వెర్రివాడా! పర్వాలేదోయి! వెళ్లి రా." అని రామారావు చేతులు మృదువుగా వదిలించుకున్నాడు.

శేఖరం, రిక్షా యెక్కి యింటికి బయలుదేరాడు. ఒకడికి అప్పివ్వకు. ఒకడిదగ్గర అప్పుతీసుకోకు అన్నది, తనసిద్ధాంతం. ఒకసారి, యీ రామారావే, ఏదో పెద్ద యిబ్బందిలో ఉండి తనని పదిరూపాయలు బదులడిగితే తను ఉండికూడా లేదని అబద్ధమాడాడు. ఎంతబుద్ధి తక్కువ తనది? ఎంత తప్పుడు సిద్ధాంతం?—తాననడగకపోయినా, తన అవసరాన్ని గుర్తించి, డబ్బిచ్చిన రామారావుది నిజంగా, అమృతహృదయం-అదే మానవత్వం. నన్నుముట్టుకోకు నామాలకాకి-అని తనచుట్టూ గోడలుకట్టుకొని ఒంటరిబ్రతుకు బ్రతికేవాడు, జీవితంలో ఎన్నో విలువైనవి పోగొట్టుకున్నట్లే. మానవుడు సంఘజీవి. చుట్టూ, అంధకారం వ్యాపించివుంటే, తానొక్కడూ వెలుగులో ఉండటానికి అవకాశంలేదు. రిక్షా ఆగింది. శేఖరు దిగి, డబ్బులిచ్చి. తాళంతీసి, యింట్లోకి వెళ్ళాడు.

పెట్టెలోని రెండుబట్టలు తీసి, చేతి సంచిలో పెట్టుకొని లేచి నిలబడ్డాడు. ఎదురుగా గోడమీద, పెళ్ళినాటి ఫోటో కన్పించింది. నుదుటపెట్టిన కల్యాణ తిలకంతో, కన్నులలో కాటుక రేఖలతో, కాళ్ళకు పారాణితో, రెండంగుళాల వెడల్పు జరీ అంచు మధుపర్కాలతో, తనప్రక్కన నిలబడ్డ నవవధువు

పార్వతి. యీనాడు — తనకు దూరంలో — ఆమె పుట్టింటివద్ద ప్రపంచమనే నందనవనంలో, తాను కారణంగా, ఒక మొలక తలయెత్తేటందుకు, జీవన్మరణాలమధ్య, ఊగులాడుతోంది — శేఖరం మనస్సు ఆ వేళంచేత. వివశమౌతున్నది. ఆనాడు — మొదటి రాత్రి—ఆమెను అనునయిస్తూ పలుకరించినప్పుడు, ఎందుచేతనో కొత్త అనిపించలేదు. వెనుక జన్మాలనుండి కూడా, తిన్ననుసరించి వస్తూన్న ప్రేయసి—తనచే పసితనం-బ్రహ్మచర్యం అనే చిన్న వ్రతాలు చేయించి ఆమె మూగనోములు పడుతూ—కొత్త కనుముగ్గై, తిరిగి అంతలోనే తన్ను చేరవచ్చినట్లనిపించింది. ఎంత ఆకర్షణ?—ఎంత ప్రేమార్ద్రత?—అణుకువతోడి అనురాగం—అనురాగప్రసన్నమగు సిగ్గుతెరల అవరోధం—ఏమా విచిత్ర సన్నివేశం!—విడివడని కౌగిటలో యిమిడిపోయి, ఎప్పటికీ తెల్లవారకుండా వుంటే బాగుండు ననిపించేది. ఆమె తన బ్రతుకులో మధువు నొలికించింది. జీవితమొక వెన్నెలబాటగా, తీయని పాటగా మార్చింది. అటువంటిది, ఏణ్ణర్ధమైనా గడవకుండానే—కల చెదిరినట్లుగా—మంచు విడినట్లుగా—తెర తీసినట్లుగా మారిపోయింది స్థితి. పురిటికి, తీసుకొని వెళ్లేందుకు తండ్రి బండిలో సామాను సర్దిస్తూంటే, తనదగ్గర శెలవు తీసుకోవటానికి వచ్చింది పార్వతి. ఆమె కన్నులలో 'ఈ గండం గడిచి నేను తిరిగివస్తానో. రాలేనో తెలియదు. ఇదే మీ తుది దర్శనమేమో!" అన్న భావం ప్రస్ఫుటంగా కన్పించింది. తనకు, కన్నులు చెమ్మగిల్లాయి. ఆమెను చేతులలోకి తీసుకొని, పెదవులను ముద్దు పెట్టుకున్నాడు. ఇద్దరి హృదయాలలోనూ, వెలిబుచ్చలేని భావాలు సందడిస్తున్నాయి. హృదయానికి, హృదయం దగ్గరైన ఆ తన్మయావస్థని "అమ్మాయీ! రైలుకి టైమవుతోంది." అన్న ఆమె తండ్రిగారి కేక భంగపరచింది. ఆమె నెమ్మదిగా విడిపించుకొని, బలవంతంగా వంగి, తన పాదాలను కళ్లకు అద్దుకుంది. ఆమె వేడికన్నీటి బొట్లు, ముత్యాలలా తనపాదాలపై రాలాయి. లేచి "వెళ్లి వస్తాను. ఉత్తరం రాస్తూ ఉండండి వేళకు సరిగా భోజనం చేస్తూ, మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ వుండండి." అని గబగబా అనేసి, బరువుగా అడుగులు వేస్తూ వెళ్లి బండి ఎక్కింది. తాను అరుగుమీద నిలబడ్డాడు. బండి సందు తిరిగేవరకూ, తనని చూస్తూనేవుంది పార్వతి, ఏకాగ్రతతో అంతులేని వేదనతో - భరించరాని క్షోభతో.

శేఖరం వాచీ చూసుకున్నాడు పావు తక్కువ రెండైంది. గబగబా బయటికివచ్చి, తలుపుకు తాళం వేసి, రోడ్డుమీద వెళుతున్న రిక్షా ఆపుచేసి "స్టేషనుకి" అని, ఎక్కి కూర్చున్నాడు. రిక్షా కదిలింది. రిక్షా నెమ్మదిగానే పోతోంది. శేఖరానికి విసుగొచ్చి "కాస్త త్వరగా నడు" అన్నాడు. "నేను గుఱ్ఱాన్ని గాని, ఎద్దునుగాని కాదండి, మనిషినండి" అని జవాబిచ్చాడు రిక్షావాడు పెంకిగా. శేఖరం విస్తుపోయి "అసలు రైలు అందుతుందంటావా?" అన్నాడు. "ఏమో! మీ అదృష్టాన్నిబట్టి వుంటుంది." అని రిక్షావాడు, బలంగా బీడీదమ్ములాగి. పొగ నిర్లక్ష్యంగా వదిలాడాకాశంలోకి. శేఖరానికి, మతి పోయినట్లయింది. ఇటువంటి జవాబులు, తాను తన యజమానిముందెన్నడైనా యివ్వగలడా? ఆ గుమాస్తా పని పోతే తాను చిల్లికానీకి మారడు. ఈ రిక్షావాడు స్వతంత్రుడు. వాడికి తాను కాకపోతే మరొకడు. ఈ రిక్షా కాకపోతే మరొక రిక్షా. రిక్షా లేకపోతే కూలిపని చేసుకొని బ్రతకగలడు. అయితేమాత్రం, అంత పొగరుమోతుతనమేమిటి? ఒక బేడ డబ్బులిచ్చి, తాను వాడి శ్రమను కొల్లగొడుతున్నాడనే గర్వం వాడిలా వ్యక్తం చేస్తున్నాడు కాబోలు! మనిషికీ మనిషికీ మధ్యఉండే సంబంధాలు చిత్రంగా తారుమారౌతున్నాయి. ఈ సంగతి తెలియని కవులూ కథకులూ వీళ్ళ దుస్థితిని గురించి కన్నీళ్లు కడవలతో కారుస్తున్నారు. ఈ మధ్యతరగతి రచయితలకి, తమ గానుగెద్దు జీవితాల కంటె రైతు, కూలీ, రిక్షావాళ్ళ జీవితాలు ఎంతో మెరుగని తెలియదెందుచేత?

స్టేషను ఎదుట రిక్షా ఆగింది. శేఖరం గబగబా దిగి, డబ్బులిచ్చి, బుక్కింగు ఆఫీసు దగ్గరికి వెళ్లాడు. జనం లేరు. కొంపదీసి రైలు వెళ్ళిపోలేదు కదా! గుండె గుభేలుమంది. ధైర్యం చేసి బుక్కింగు గుమాస్తాని అడిగాడు. బండి రెండుగంటలు లేటు. శేఖరానికి సంతోషించాలో, విచారించాలో తెలియలేదు. ఎంత త్వరగా చేరుకోవాలని తహతహలాడుతున్నాడో అంత ఆలస్యమవుతోంది. తాను వెళ్ళేసరికి పార్వతి జీవించి, ఉంటుందా?—ఆఖరికి చూపులైనా దొరుకుతాయా? కనుకొలకుల్లో నీళ్లు నిలిచాయి. నెమ్మదిగా తుడుచుకున్నాడు. సెకండుక్లాసు టిక్కెట్టు తీసుకొని, ప్లాట్ ఫారంమీదికి వెళ్లాడు. అటునించి యిటూ,

యిటునుంచి అటూ తిరిగాడు. మనస్సులో ఒక్క బాధ—ఏమీ తోచడం లేదు. వెయిటింగు రూములోకి నడిచాడు, కాసేపు కూర్చుందామని. క్రిక్కిరిసి వుంది. ఒక పల్లెటూరి పెద్దమనిషి, పూర్తిగా సోఫా ఆక్రమించుకొని, శేషశాయిలా, పవ్వళించివున్నాడు. చోటులేక అటూ యిటూ పచార్లుచేసే వాళ్ళేకాని, ఒక్కడికీ, ఆయనని లేచి కూర్చోమనే సాహసం లేకపోయింది. ప్రతివాడికీ, ఆపని మరొకడుచేస్తే బాగుంటుందని వుంది. కాని ఒక్కడూ, ఆపనికి పూనుకోకపోవడంవల్ల, అందరూ ఆ మనిషి సుఖానికి, యీర్ష్య పడుతున్నారు. ఎంతో మానసికాందోళనలో వున్న శేఖరం, నిలబడివుండలేక "ఏమండీ! కాస్త లేచి కూర్చోండి." అన్నాడు బిగ్గరగా, ఆయన తను కాదన్నట్లుగా ముఖాన్ని అవతల ప్రక్కకి తిప్పుకున్నాడు. శేఖరానికి వళ్ళు మండింది. "మీకే చెప్పేది!" అని చేతితో తట్టిలేపాడు. ఇక ఎలాగా లాభం లేదని, ఆ ఆసామీ "మంచీ, మర్యాదా లేదూ!" అంటూ గొణుగుకొని లేచి కూర్చున్నాడు. అటూ యిటూ తిరుగుతున్న వాళ్ళంతా ఒక్కసారి ఖాళీస్థలంమీదకి ఎగబడ్డారు. చివరికి శేఖరానికి చోటులేకపోయింది. ఈ హడావిడి చూసి టిక్కెట్టు కలెక్టరు చెక్కింగుకి వచ్చాడు. ఒక్కొక్కరే చూపిస్తున్నారు. "నేనింకా టిక్కెట్టు కొనలేదు." అంటూ చివాలునలేచి పెట్టెభుజానపెట్టుకొని బయటికిపోయాడా పల్లెటూరి ఆసామీ. శేఖరమూ కాళీలో కూర్చున్నాడు. "వచ్చివ్వలివాడు ఒడ ముందెక్కాడట" అన్నాడొకాయన, వెళ్ళిపోతున్న వాణ్ణి చూపిస్తూ. అంతా ఒక్కసారి పకపకా నవ్వేరు. మనస్సులో వేదన పురుగుతొలిచినట్లు దొలుస్తుండటంవల్ల శేఖరం ఎంతోసేపు కూర్చుని ఉండలేకపోయాడు. లేచి బయటికి నడిచాడు. "ఈమాత్రానికి, పడుకున్న పెద్దమనిషిని బలవంతంగా లేపి అల్లరిచెయ్యడమెందుకో?" అని ఒక వచనం వినిపించింది. ఈ దేశంలో, హంతకుడికి కూడా శిక్షపడ్డాక, సానుభూతి చూపించేవాళ్ళు కోల్లలుగా ఉన్నారు అనుకుంటూ, ఒకసారి అసహ్యంతో వెనక్కి తిరిగిచూసి, పుస్తకాలషాపువైపు నడిచాడు. ఒక్కటీ పనికివచ్చే పుస్తకం లేదు. అన్నీ డిటెక్టివు నవలలు - మూడు హత్యలు - హత్యపై హత్య - నూతిలో శవం-చావుకేక —ఛీ ఛీ అనుకుంటూ శేఖరం, ప్లాటుఫారంమీదకి వెళ్లాడు. సిగ్నలు వాలింది. దూరంలో పొగ కన్పిస్తోంది. జనం సందడి హెచ్చింది. ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ హడావిడిగా ముందుకి వస్తున్నారు. రైలు కొద్దిగా వొస్తోంది. అన్నట్లు కాఫీ తాగలేదుగా - అలవాట్లు మనిషిమీద స్వారీ చేస్తాయి. స్టాలు దగ్గరికివెళ్ళి కాఫీ తీసుకున్నాడు. రైలు వచ్చి స్టేషనులో ఆగింది. ఇంజను నీళ్ళు పోసుకొనిరావడానికి పావుగంట టైముందని తెలిసికూడా లోపలివాళ్ళు దిగకుండానే, బయటివాళ్ళు రైలుపెట్టెలలోకి దూరిపోతున్నారు సామానుతోసహా - ఎందుకో యీ హడావిడి. ప్రతివాడూ తన స్వార్థమే కాని ఎదిరివాడిగోడు పట్టించుకోడు. ఎప్పుడు, బాగుపడుతుందీ దేశం!

శేఖరం నెమ్మదిగా వెతుక్కుంటూ వెళ్ళి సెకండు క్లాసుపెట్టె దగ్గరికి చేరి నిలబడ్డాడు. ఒక ముసలమ్మ గబగబా ఎక్కబోతోంది. 'ఇది పగఫుల పెట్టె. ఇంకోదానిలోకి పో." అని లోపలినుంచి, గద్దిస్తున్నాడొక ప్రయాణికుడు. "పక్క స్టేషనులో దిగిపోతాను, బాబ్బాబు కాసేపు కూర్చోనియ్యి" అని ముసిల్ది ఎక్కబోయింది. "వీల్లేదు. టికెట్ కలెక్టరొస్తే రెట్టింపుచార్జీ వసూలు చేస్తాడు. వెళ్ళు వెళ్ళు." అని ఆయన దారిలో అడ్డు నిలబడ్డాడు. "చిలకతండ్రి. రైలు తనే కొన్నట్టు మాటాడుతున్నాడు" అని విసుక్కుంటూ, ఆ ముసిల్ది మరోక పెట్టెదగ్గరకిపోయింది. శేఖరానికి, అంత విషాదంలోనూ, పెదవులపై చిరునవ్వు తొంగి చూసింది. నీళ్లుతాగ, యింజను వచ్చి కూత వేసింది. శేఖరం, పెట్టెలోకి ఎక్కాడు. ఒక్క కుదుపుతో రైలు కదిలింది. అరరే-చేతిసంచి టీస్టాలు దగ్గర మరచిపోయాను. ఇప్పుడెలాగ? తలుపు దగ్గరికి వెళ్ళి నిలబడి, స్టాలు ఎదటికి రాగానే కేక పెట్టాడు. కాని ఎవ్వరూ వినిపించుకోలేదు, రైలు ధ్వనిలో. సంచీ పోయింది - పార్వతి కూడా తన్ను విడచిపోతుందా? ఈ రోజు అంతా అపశకునంగానే వుంది. నుదుటిమీద ఏమి రాసిపెట్టి వుందో కాని!

నిట్టూరుస్తూ వెళ్లి, శేఖరం కాళీచూసుకొని కూర్చున్నాడు. ఎదర కిటికీదగ్గర ఒక ముసలాయన సావధానంగా చుట్ట కాల్చుకుంటున్నాడు. ఆయన ప్రక్కన, ఒక పదహారేళ్ల యువతి నవ్వుముఖంతో, ఒడిలో కళ్లు తెరవని పసిగుడ్డునుంచుకొని కూర్చొనివుంది. ఇంతలో పిలవాడు 'క్యార్ క్యార్' మన్నాడు. ఆ అమ్మాయి ముసలాయనకేసి సాభిప్రాయంగా చూసింది. "పరవాలేదు. ఆపక్కకి తిరిగి పాలియ్యి." అన్నాడాయన.

ఆమె ఓసారి సిగ్గుగా, ఎదరకూర్చున్న శేఖరాన్ని చూసి, కొంచెం అడ్డంగా తిరిగి, రవిక వనులు వేసుకొని, పసివాడికి పాలిస్తూ, పమిటిచెంగు కనపడకుండా కప్పుతుంది. అరవిచ్చిన కలువరేకులలావున్న ఆమె కాటుకకన్నులు కొద్దిసేపటిలో అరనిమీలితాలై, తన్మయావస్థని తెలియజేశాయి. తన జీవశక్తిని, అమృతధారగా మార్చి, ఎలాబీరేపువంటే, ఆ పసికందు లేత పెదవులకందించటంలో ఆమె పొందే మధురానుభూతి, ఆ అరమూతకన్నులలో ప్రతిఫలిస్తోంది. అసలే తెల్లని జామిపండురంగు—అందుకు సాయం, శరీరమంతా పసుపుతో నలుగుపెట్టి అభ్యంగన స్నానం చేయించివుంటారు. ప్రసవం అవటంవల్ల పీక్కుపోయిన చెక్కిళ్లు ఒక కొత్త అందాన్నిస్తున్నాయి. క్రొత్తగా మాతృత్వాన్ని పొందిన ఆమెకళ్లు గర్వంతో తళతళలాడుతున్నాయి. దేవుడు మేలుచేసి పార్వతికి గండం గడిస్తే, యిలాగే ఉంటుంది పార్వతి ఒళ్ళో పసిపాపతో! అంతఅదృష్టం తన నొసటను రాసివుందా?—శేఖరం ప్రక్కకి తిరిగి ఒక నిట్టూర్పు విడిచాడు. ప్రక్కన కూర్చున్న వారు కారు. ఆ ముసలాయనని "ఏమండీ! పచ్చిఒంటి మీద. అమ్మాయి నెక్కడకు తీసుకువెడుతున్నారు?" అని అడిగాడు.

"ఎంకెక్కడికి బాబూ! అత్తారింటికే! పిల్లాడి యిన్నాళ్లకి కిరస్తై ఒకటి. మా అల్లుడు చెపితే వింటేనా! ఆయన ఒక దూర్వాసుడు. కాదు-కూడదు—తీసుకు వచ్చి దింపమన్నాడు. ఆడపిల్లని కన్నతర్వాత మన మాట సాగుతుందా?"

"కాస్త గట్టిగా చెప్పిచూడక పోయారా? ఈ పచ్చిఒంటిమీద ఆరోగ్యం చెడవచ్చు."

ఆ అమ్మాయికి ఏమి స్ఫురించిందోగాని, చటుక్కున సిగ్గుపడి, వెంటనే పెదవులపై చిరునవ్వును తుడిచివేసుకొని, తలప్రక్కకి తిప్పుకుంది. "చెప్పక పోవటమేమిటి? ఆఖరికి ఊరికరణంగారిచేతకూడా చెప్పించాను. కాన్పు చాల కష్టమైపోయింది. పిల్ల చచ్చి బ్రతికిందనుకోండి. నిజంగా పునర్జన్మే. రెండు మూడు నెలలు తల్లిపోషణలో వుంటే పిల్ల తేరుకుంటుందంటే. వింటేనా - వాళ్ళ అమ్మగారు ఆ మాత్రం కనిపెట్టి చూడగలదని ఆయన జవాబు. చేసిన జబ్బుకి అసలు పిల్ల బతుకుతుందనుకోలేదు. తిరుపతి వెంకటరమణుడు మాపాల ఉండబట్టి, ఎలాగో గట్టెక్కాం. మొక్కు తీర్చుకొని వస్తానన్నా వినలేదే!"

శేఖరానికి గుండె గుబగుబలాడింది. కూర్చోలేకపోయాడు. లేచి, తలుపు దగ్గరకు వెళ్ళి బయటికి చూస్తూ నిలబడ్డాడు.

"నా పార్వతిని నాకు దక్కించు. నీ కొండకు వచ్చి దర్శనం చేసుకుంటాం." అని మనస్సులో మొక్కుకున్నాడు. కొద్దిగా నవ్వువచ్చింది, ఆపదలో ఉన్నప్పుడు దైవం గుర్తుకువస్తున్నాడని. అప్పుడప్పుడు పడుతున్న వర్షాలమూలాన, కనిపిస్తున్న మేర, పచ్చగా కన్నులపండువు చేస్తోంది. వరి ఏపుగా పెరిగి తళతళలాడుతోంది. చెట్లు కొత్త ఆకులు తొడిగి; యౌవన ప్రాంగణంలో అడుగు పెట్టిన నవ వధువులా కనబడుతున్నాయి. అరటితోట—ఎంతో నవకంగా ఎదుగుతోంది. ఈ తోటలో గెలలు దింపుతున్నారు. మందు వేసినట్టున్నారు గెలలు భారీగావున్నాయి. అరె! చెట్లు కొట్టివేస్తున్నారే! గెల వేయటంతో చెట్టు పని ఆఖరే నన్నమాట! ఏదో అశుభభావం చెళుక్కున చెంపపెట్టులా హృదయాన్ని తాకింది. కళ్ళు మూసుకొని రెండు నిమిషాలు నిలబడ్డాడు. ఎప్పుడెక్కడో కాని ఒక ముష్టివాడు "ప్రేమ ప్రేమంటావు - ప్రేమలో విషముంది —వైరిపక్షకే- ఓ రామచిలుకా!" అని కంజరీ వాయిస్తూ పాడటం మొదలుపెట్టాడు. "భగవంతుడా" అని గుప్పిడి మూసి నుదిటిమీద పెట్టుకొని. తలుపును ఆనుకొని నిలబడ్డాడు శేఖరం.

రైలు వేగం తగ్గింది. పాట ఆగింది. స్టేషను వస్తోంది కాబోలని, శేఖరం కళ్లు తెరిచి బయటికి తొంగి చూసేడు. అవును స్టేషను వస్తోంది. సిగ్నలు కనబడుతోంది. ఎదర తాటితోపు. దాని వెనకగా సన్నగా పొగవస్తోంది. కొద్దిగా జనం మూగివున్నారు. ఏమిటది? ఒక్కసారి గుండె జల్లుమంది. గిరుక్కున వెనక్కి తిరిగాడు. గుడ్డిముష్టివాడు "మాయా కాయము రా జీవా, మాయా కాయము రా" అని పాడుతూ జనాన్ని తోసుకుంటూ తలుపుదగ్గరకు చేరుతున్నాడు. ఈముష్టివాళ్లు "అందమె ఆనందం ఆనందమె జీవిత మకరందం" అనో, "గృహమే కదా స్వర్గసీమ" అనో కాక వినేవాళ్లకి హాయిగొలిపే యిటువంటిపాటలు పాడుతారెందుకో? కలవాళ్లకి, లేని వాళ్లకి జరిగే పోరాటంలో యిదొక బాష్పవాయు ప్రయోగం కాబోలు! "సుఖంగా ఉన్నానని మురిసిపోతున్నావు ముందున్నది ముసళ్ళ పండగ" అని జ్ఞాపకంచేసి, వాళ్ళుకొంత ఆత్మసంతృప్తి పొందుతారు. వినేవాళ్ళు తమ సుఖ

స్వప్నాలు చెదురుతూ ఉండటం ఓర్చుకోలేక త్వరగా రెండు డబ్బులు పారేసి వెళ్ళని వదుల్చుకుంటూ ఉంటారు. రైలు స్టేషనులో ఆగింది. శేఖరం దిగి ఒక సోడా పుచ్చుకొని ముఖం కడుక్కొని మిగిలింది తాగి, జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. వెనక సిగ్నలిచ్చారు. వచ్చాం ఇక్కడ క్రాసింగు కాబోలు—అయితే ఆలస్యం అయిందని బాధపడుతూంటే యిది ఒకటో—బండే కదులుతోంది. శేఖరంవెళ్లి పెట్టెలోకిఎక్కి తన స్థానంలో కూర్చున్నాడు. ఎదరబండి, ఒగరుస్తూ వచ్చి స్టేషనులో ఆగింది. దిగేవాళ్లు దిగుతున్నారు. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. గంటకొట్టారు. ఆబండి కదలింది. శేఖరం ఉక్రోషం పట్టలేక "వెనకవచ్చిన బండి ముందు వెడుతోందేమిటి?" అన్నాడు బిగ్గరగా. ముసలాయన "అందులో ఆశ్చర్య మేముంది నాయనా? ముందు వచ్చిన చెవులకంటె వెనకవచ్చిన కొమ్ములు వాడి కాదూ?" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. ఆ నవ్వులో ఎంతో అనుభవం—వివేకం కనిపించాయి. ప్రక్కన కూర్చున్న షావుకారు పకపక నవ్వి "బలేగా శెలవిచ్చారు! మనం వచ్చినదారి, మనముండి స్టేషను లోకి రాగానే సరిచేస్తారు. మనం వెళ్లవలసిందారి, ఎదరబండి వచ్చేక కాని సరిచెయ్యరు. అందువల్ల అది ముందు - మనం వెనక." అన్నాడు తనకున్న విశేష జ్ఞానాన్ని సగర్వంగా వ్యక్తపరుస్తూ.

ప్రక్క స్టేషనులో ముసలాయన, ఆయనవెనుకమార్తె దిగారు. ఆ అమ్మాయి వెడుతూంటే ఎవరో ఆత్మీయురాలు దూరదేశాలకి వెళ్లిపోతూ ఉన్నట్లు దిగులు కలిగింది. కొందర్ని చూస్తే, అకారణంగా అనురాగం కలుగుతుంది. మరికొందర్ని అకారణంగా ద్వేషిస్తాము.—అవి జన్మాంతర సంబంధా లేమో ననిపిస్తుంది. రైలుబండిలో ముక్కూ మొహం ఎరగనివాళ్లు కలుస్తారు. కలిసి వున్నంతసేపు, ఎంతో ఆప్యాయత ఒలకపోస్తారు. ఎవరిస్టేషన్లలో వాళ్లు వెనక్కితిరిగి చూడకుండా గప్‌చిప్‌గా దిగిపోతారు. జీవితం కూడా ఒక రైలుబండే. ఏ ఆలోచనవచ్చినా, ఆదారిలోకే లాగుతోం దేమి చెప్మా అని ఖిన్నుడై, శేఖరం కాసేపు నడుం వాలిస్తే బాగుంటుం దేమోనని, వాళ్లు ఖాళీచేసిన సీటుమీద వెళ్లి, పడుకున్నాడు. రైలు వేగంగా దూసుకొనిపోతోంది. మనస్సు ఆశా నిరాశలమధ్య ఊసులాడుతోంది. కొంచెంత ఆపగా, విరుచుకొని మీద పడబోతోందన్న భావం హృదయాన్ని రంపంతో కోస్తోంది. శేఖరం అసహనంతో ఒక్కసారి మూలిగాడు. చలిగాలివచ్చి ముఖాన్ని తాకింది. ఇదేమిటని, ఉలిక్కిపడి లేచి కూర్చొని, కిటికీలోనుంచి చూశాడు. ఆకాశం మబ్బుల వెనక మాయమైంది. అప్పుడే దూరాన్నుండి, వర్షం తరుముకు వస్తోంది. ఒక్కసారి, కళ్లు జిగేలుమనేటట్లు, ఒక మెరుపు బాకులా దూసుకుపోయి, ఆకాశం భయంకరంగా వురిమింది. గన్నేరుకొమ్మమీద, ముద్దుగా కూర్చున్న గోరువంకల జంటలో ఒకటి, ఎక్కడికో ఎగిరిపోయింది. వానవచ్చి రైలును ముంచెత్తింది. అరగంటలో ఎంత మార్పు? అందుకే వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదంటారు. కిటికీ తలుపులు మూసేశారు బయట వర్షం హోరు వినబడుతోంది. ప్రకృతి భయంకరంగా ఉంది. శేఖరం మానసిక స్థితి కూడా అలాగేవుంది. ఏమిటీ అవాంతరాలు? స్టేషనులో దిగాక ఓ మైలు పొలాల్లోంచి నడవాలి లేకపోతే చుట్టిరోడ్డున మూడు మైళ్ళు. ఈ వర్షంలో అసలు బండి దొరుకుతుందా? దొరకకపోతే ఏం చెయ్యాలి? అంతా అయోమయంగా వుంది. ప్రకృతి, యీ విధంగా తనపై కత్తికట్టినందుకు, శేఖరం నిస్సహాయతలో పళ్లు కొరుక్కున్నాడు. బయట వర్షం హోరు క్రమంగా తగ్గుతోంది. ఏదో స్టేషను వచ్చింది. శేఖరం కిటికీ తెరిచాడు. అరె! దీని తర్వాతదే, తాను దిగవలసింది. గడియారం చూసుకున్నాడు. ఏడుగంటలైంది. బయట అంధకారం. చిన్న చిన్న తుంపర రాలుతోంది. దిగాల్సిన స్టేషను వచ్చింది. లేచి నిలబడి, పరధ్యానంగా, చేతి సంచీకోసం అటూ యిటూ చూశాడు. అది అక్కడే పోయిందిగా! చిన్నగా నవ్వుకొని, దిగి, గేటుదగ్గర టిక్కట్టిచ్చేసి బయటికి వచ్చాడు.

ఆ స్టేషనులో యిద్దరో ముగ్గురో మాత్రం దిగారు వాళ్ళు, కండువాలు తలలమీద కప్పుకొని నడిచిపోయారు. ప్లాట్‌ఫారం నిర్మానుష్యంగా వుంది. స్టేషనులో గుడ్డిదీపం మినుకుమినుకు మంటోంది. స్టేషను మాస్టరు, ఏదో ఏకధ్యానంగా లెక్కలు సరిచూసుకుంటున్నాడు. ఒక మూల, ఒక కుక్క పడుకొని. చలికి ఓర్చుకోలేక 'కుయ్యి కుయ్యి' మంటోంది. బయట ఒక ఒంటెద్దు బండిమాత్రంవుంది. శేఖరం 'బ్రతుకుజీవుడా' అనుకొని "ఏయ్! బండి అబ్బాయ్" అని కేక పెట్టాడు.

"అయ్యా!" అంటూ బండివాడు, వణుకుతూ వచ్చి నిలబడ్డాడు.

"రామాపురం వెళ్ళాలి."

"ఓరిబాబో! రామాపురమే! అసలే గతుకుల రోడ్డు. అందులో వర్షం. బండి కదుల్తుందాండీ?"

"తప్పదు. ఎలాగో అలాగ నన్నక్కడ చేర్చాలి."

"ఏమిస్తారు?"

"నువ్వడుగు."

"అయిదు రూపాయ లిస్తారా?"

తన నిస్సహాయతను బండివాడిలా లాభంకింద మార్చుకోవడానికి చూస్తుంటే, శేఖరానికి వళ్ళు మండింది. కాని అవసరం. ఏం చేస్తాడు? వసుదేవుడంతటివాడు గాడిదకాళ్ళు పట్టుకున్నాడు.

"సరే కట్టు." అన్నాడు.

ఎద్దు, బురదలోంచి బలవంతంగా ఒగరుస్తూ బండిని యీడ్చుకు వెళుతోంది. చుట్టూ గాఢాంధకారం. బండి అడుగున కట్టిన లాంతరు, గాలికి తట్టుకోలేక రెపరెప లాడుతోంది. కప్పల బెకబెకలూ, కీచురాళ్ళ ధ్వనీ మాత్రం, నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నాయి. మధ్య మధ్య, మెరుపులూ, ఉరుములూ, మేమింకా ఉన్నామనిపిస్తున్నాయి. ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ శేఖరం మానసికాందోళన, ద్విగుణీకృతమౌతోంది. ఆశా, నిరాశలమధ్య ఊగులాట దుర్భరంగా పరిణమిస్తోంది. కొద్ది సేపట్లో భవిష్యత్తు అటో యిటో తేలిపోతుంది. చలిగాలి శరీరాన్ని గజగజ వణికిస్తోంది. ముడుచుకొని కూర్చున్నాడు. లాభంలేక పోయింది. ముడుచుకొని, పడుకొని, కండువా కప్పుకున్నాడు. కొంతనయం. మనస్సులో ఆలోచనలు రేగాయి అసలు పార్వతి గర్భవతి అయిందని తెలిసినప్పుడే తనలో ఏదో అపశ్రుతి మోగింది. ఏదో అవ్యక్తమైన ఆందోళన, భయం కలిగాయి. తనతల్లి తనని కని, పురిటిలోనే మరణించిందన్న సంగతి గుర్తుకు వచ్చి, అది వంశాచారమౌతుందేమోనన్న భయం, మనస్సులో చీకటిలా పాకింది.—ఆ రోజున, తనకి యింక్రిమెంటు వచ్చింది. ఆ సంతోషవార్త పార్వతికి చెప్పి, సినిమాకి తీసుకువెడదామని, అయిదవగానే ఆఫీసునుంచి బయటికి వచ్చి, దారిలో చామంతిపూలు పొట్లం కట్టించుకొని ఉషారుగా యింటికివచ్చి "పారూ-పారూ" అని తలుపు తట్టాడు. తలుపు దానంతట అదే తెరుచుకొంది. ఆశ్చర్యం వేసింది. ప్రతిరోజూ, తలుపు గడియవేసి ఉండటం, తాను పిల్చిన తర్వాత తలుపుదగ్గర గాజుల చప్పుడు వినపడటం "ఎవరో, పేరు చెప్పాలి." అనడం "అబ్బ! తలుపుతీద్దూ." అని తనఅనడం, ఆమె వెండిగువ్వల ధ్వనిలా కిలకిలా నవ్వుతూ తలుపుతియ్యడం అలవాటు. ఈ రోజిలా జరిగిందేమిటని, అనుమానిస్తూ పడకగదిలోకి వెళ్ళాడు. పార్వతి, మంచంమీద అటుతిరిగి పడుకొనివుంది. "పారూ! వంట్లో బాగాలేదా?" అన్నాడు. "ఊ! వికారంగా ఉంది." "డాక్టర్ని పిలవనా?" "అక్కర లేదు" ఆమె పెదవులచివర ఒక మందహాసం, రేఖామాత్రంగా గోచరించి మెరుపులా మాయమైంది. మంచం మీద కూర్చొని, ఆమె పైకివంగి "ఏమిటి పారూ!" అన్నాడు, దీనంగా. ఆమె తలపైకెత్తి, అతని చెవిలో "మనకు పాపాయి పుడతాట్ట" అని మెల్లిగా చెప్పి, నవ్వి, సిగ్గుపడి, చేతులలో ముఖందాచుకొని పక్కకి ఒరిగిపోయింది. తనకుకూడా సిగ్గు ముంచుకు వచ్చింది. ఏడాదైనా గడచిందో లేదో, అప్పుడే సంతానమా? రోజులు గడచేకొలదీ వేవిళ్ళబాధ ఎక్కువైంది. డోకులు, వికారం. గులాబీలవంటి చెక్కిళ్ళు పాలిపోయాయి. కన్నులు గుంటలుపడ్డాయి. మల్లెపూబంతి లాంటి పార్వతి, తనశరీరంలో మరోజీవాన్ని పెంచే యత్నంలో, తన లావణ్యాన్నీ, చైతన్యాన్నీ హారతి కర్పూరంలా అర్పిస్తోంటే తనకు మనస్సులో దేవినట్లుండేది. ఆమె తండ్రివచ్చి, రెండునెలలుంచుకొని వేవిళ్ళు తగ్గాక పంపుతానన్నాడు. తాను సరేనన్నాడు. కాని, పార్వతి అంగీకరించలేదు "ఆయనకి హోటలుతిండి అసలే పడదు. ఏడో నెల వచ్చాక, ఎలాగూ తప్పదుకదా! ఇప్పుడు రాను." అనేసింది. తన ఎడబాటును సహించలేక, వెర్రిపార్వతి పుట్టింటిలో సుఖాన్ని కూడా వదులుకొని, ఒకపూట లేస్తూ ఒకపూట పడుకుంటూ, అలాగే గడిపేసింది ఏడో నెల వరకూ. తనలాగే ఆమెకుకూడా యిది శాశ్వతవియోగమౌతుందేమోనన్న భయం కలిగిందేమో!

శేఖరానికి మగతనిద్ర పట్టింది. అందులో కల— వర్షంలో తడుస్తూ, బురదలో యీదుకుంటూ, అర్ధరాత్రికి అత్తవారిల్లు చేరుకున్నాడు. తనని చూడగానే, అత్తగారు అమాంతంగా వచ్చి కౌగలించుకొని "నాయనా! శేఖరం! వచ్చావా! నీపార్వతిని నీకప్పగిస్తున్నాను. ఎలా రక్షించుకుంటావో! అది చావుబతుకులమీద వుంది."

# మౌనవేదన!

అని పెద్దపెట్టున ఏడ్వటం మొదలు పెట్టింది. మామగారు, ఒక మూల మాటాపలుకూ లేకుండా ముడుచుకుని కూర్చున్నాడు, వెక్కి వెక్కి ఏడుస్తూ. శేఖరం పురిటి గదిలోకి వెళ్లాడు. పార్వతి బాధతో ఊపిరి చుట్టుకు పోతోంది. మంత్రసాని ధైర్యం చెపుతోంది. శేఖరం కనిపించగానే పార్వతి ఒకసారి చురుగ్గా నిష్ఠూరంగా చూసి, చివాలున తలప్రక్కకి త్రిప్పుకొని "అమ్మా! నేనీ బాధ పడలేనే కాస్త విషం పెట్టి చంపెయ్యండే" అని ఏడ్చింది. ఆమె చూపులో "ఓ దుర్మార్గుడా! నీ మూలానే నాకీ బాధంతా! నువ్వూ నేనూ సుఖం సమానంగానే అనుభవించాం. కాని నేను భరింపరాని బాధతో, మృత్యుద్వారం దగ్గరికి చేరాను. నువ్వు పూలరంగడిలా టింగురంగామని తిరుగుతున్నావు. ప్రకృతీ పురుషుడూ కూడా స్త్రీనే వంచించారు. ఇదేం న్యాయం?" అన్న భావం శేఖరానికి గోచరించింది. అతని కళ్ళు వరదలైనాయి. మంచం మీద కూర్చుని ఆమె కపోలాలు మృదువుగా తాకుతూ "పారూ! భయపడకు. నేను తిరుపతి వెంకటరమణునికి మొక్కుకున్నాను. ఈ గండం గడుస్తుంది. మనకి సంతానం వద్దు. నిన్న నేనూ, నన్ను నువ్వూ చూసుకుంటూ బ్రతుకుదాం. నాకేమీ అక్కరలేదు పారూ! నువ్వు బ్రతికితే చాలు" అని గద్గదంగా ఎడ్చేశాడు. శేఖరానికి తటాలున మెలకువ వచ్చింది. చక్రాలు బురదలో కూరుకుపోయి, బండి కదలటం లేదు. బండివాడు బూతులు తిడుతూ ఎద్దుని చచ్చేటట్లు బాదుతున్నాడు. శేఖరం కిందకురికి వెనకనుంచి బలంగా తోశాడు. బండివాడు ముందునుంచి లాగాడు. ఎలాగో బయటపడి, బండి మళ్ళీ సాగింది. శేఖరం, ఎక్కి కూర్చుని "ఇంకా ఎంతదూరం ఉంది?" అన్నాడు విసుగ్గా. 'వచ్చేశాం బాబూ! అవిగో, దీపాలు కనబడుతున్నాయి."

ఊళ్ళోకి వెళ్ళేదారిలో శ్మశానం. వర్షానికి తడిసి చలిలో గజగజా వణుకుతూ "ఊర్రో" మని అరుస్తున్నాయి నక్కలు. శేఖరం గుండె ఒక్కసారి జల్లుమంది. తామరచెరువు - చెరువుప్రక్కన శివాలయం - ఏమైనా రోదన ధ్వనులు వినపడుతున్నాయేమో నని, చెవులు నిక్కబొడిచి విన్నాడు. తన గుండెదడ మాత్రం స్పష్టంగా వినిపించింది. ఊరు మాటుమణిగింది. భయంకరమైన నిశ్శబ్దం చీకటిముసుగులో రాజ్యమేలుతోంది.

బండి ఆగింది. శేఖరం, ప్రాణం ఉగ్గబెట్టుకొని దిగాడు. తలుపులు వేసి వున్నాయి. 'ఇదేమిటి చెప్మా!" అని విస్మయపడుతూ, నెమ్మదిగా తలుపుతట్టాడు.

"ఆ! వస్తున్నా!" అంటూ అత్తగారు వచ్చి తలుపు తీసింది. శేఖరం వెలవెలబోతూ ఆమెవైపు చూశాడు. "మధ్యాహ్నం పన్నెండు గంటలకి కాన్పయింది. ఆ వెంకటరమణుడి దయవల్ల తల్లీ, పిల్లాడు కులాసాగా ఉన్నారు నాయనా!" అంది. శేఖరానికి, తలమీదనుంచి కోటిమణుగుల బరువు తీసేసినట్లయింది. ఒక్కసారి గాలిలో తేలిపోయినట్లనిపించింది. సంతోష సముద్రపు పొంగులా ముంచెత్తి, అతడు గడచివచ్చిన వేదనామార్గాన్ని ఆనవాలు లేకుండా తుడిచివేసింది.

"బండివాణ్ణి అన్నం తిని వెళ్ళమనండి." అంటూ ఆత్రంగా పురిటి గదివైపు వెళ్ళబోయాడు. "కాళ్ళు కడుక్కో." అంటూ అత్తగారు, చెంబుతో అడ్డుగా నిల్చునియున్న సంగతి గది గుమ్మంలోకి వెళ్ళేదాకా అతను గమనించలేదు. వెనుకనున్న మరదలు పకాలున నవ్వేసింది. "నిన్న, మధ్యాహ్నంనుంచి నొప్పులు పడుతోంది. ఉదయానికి కూడా కాన్పు కాకపోతే భయపడి, టెలిగ్రామిచ్చాం. పిల్ల చాలా కష్టపడింది నాయనా!" అంటున్న అత్తగారి మాటలు, శేఖరం చెవికెక్కనే లేదు. కాళ్ళు కడుక్కొని, పురిటిగదిలోకి వెళ్ళాడు.

పసిబిడ్డని, ఎడమ చేతితో హృదయానికి హత్తుకొని, గాఢనిద్రలో ఉంది పార్వతి. ఆ అలసిపోయిన కనురెప్పల్లో ఏదో అనిర్వచనీయానందం, గర్వం గోచరించాయి శేఖరానికి. "పారూ" అని మృదువుగా పిలిచాడు. పార్వతి కన్నులు తెరిచింది. అవి ప్రేమతో తళతళలాడాయి. ఆమె బిడ్డని మరింత దగ్గరగా తీసుకొని "మీరు వచ్చారా?" అంది, నీరసంగా. ఆ భార్యాభర్తలు ఒకరినొకరు కన్నులతో తనివితీరా చూసుకున్నారు. ఆ కన్నులు మూగభాషలో, ఎన్నో విషయాలు ముచ్చటించుకున్నాయి.